విస్మరించి మనిషి తన స్వార్ధాన్నే చూచుకుంటాడు. వసంత లాంటి వాళ్ళంతా ఇటువంటి బాధ్యతను గుర్తిస్తే కొంత వరకైనా ఆకలి అంతరించిపోదా ? అనుకుంది మాలతి. ఆ విషయాల్నే వ్యాసంలో ప్రస్తావించింది. ఐవా, దీనికి పూర్తి పరిష్కారానికి మార్గం ఏమిటా అని, మళ్ళీ అంతు దొరకని ఆలోచనల్లో పడింది మాలతి.

వనిత ( అగష్టు 1978 )

# ఉదయం

ఉదయకు మెలకువ వచ్చింది. కాని కళ్ళు తెరవాలనిపించలేదు. మనసంతా భారంగా ఉంది. ఇంకా ఎంత సేపైనా, కాదు ఎన్ని రోజులైనా నిద్రావస్థలోనే గడిచిపోతే బాగుండుననిపింస్తోంది. మెల్లగా కళ్ళు తెరచింది. బల్లమీద ఉన్న గడియారం ఏడు గంటలమీద ఇరవై నిమిషాలు చూపిస్తోంది. "బాగా తెల్లవారి పోయిందే" అనుకుంటూ పెరటి వైపు నడిచింది ఉదయ. ప్రతి రోజులాగే ఉదయ స్నానంచేసి వచ్చేసరికి, శాంతమ్మగారు కాఫీ, టిఫిన్ అందించారు ప్రేమగా. కాఫీ, టిఫిన్ తీసుకొని హాలులోకి వెళ్ళింది ఉదయ. మవునంగా టేబిలుమీద పెట్టింది.

"దేవిగారు ఏమిటో ఇంత ఆలస్యంగా లేచారు" అన్నాడు రవి. ఉదయ ఏమీ బదులు చెప్పలేదు. ఆమె హృదయాన్ని నిన్న నే తనకు తెలిసిన విషయం బాధిస్తోంది. తనవాళ్లు మోసం చేశారు. ఈ ఇంటి కోడలుగా అడుగుపెట్టి తను మోసపోయింది. నిన్నటి వరకూ తనకంటే అదృష్ట వంతు లెవరని మురిసి పోయింది. అనురాగం కురిపించే భర్త, అమ్మని మరపించే అత్తగారు, ఆత్మీయత పంచే ఆడపడుచూ, తన ఇల్లే స్వర్గమని పించింది ఉదయకు. మరి నేడు ? ఒక నిజాన్ని తెలుసుకుంది. ఈ ఆనందమంతా తను కొనుకున్నది. అంటే తనకు తెలియకుండానే ఈ సౌఖ్యం కోసం తన ఆశయం బలి అయిపోయిందన్న మాట. ఉదయ భారంగా నిట్టూర్చింది.

"ఏమిటి ? ఉదయా ? కాఫీ చల్లారిపోతుంది. దేని గురించి ఆలోచన" అన్నాడు రవి.

ఉదయ మవునంగా కాఫీ టిఫిన్ పూర్తిచేసి లోపలికి వెళ్ళింది. రవికి ఆశ్చర్యం వేసింది. కాపురానికి వచ్చిన ఈ పది రోజులలో ఉదయ ఎప్పుడూ ఇంత నిర్లిప్తంగా కని-పించ లేదు అతనికి. నవ్వుతూ, నవ్విస్తూ తెల్లని సిరిమల్లెలా, చల్లని వెన్నెలలా అతని మనస్సు అలరించిన ఉదయలో రాత్రినుంచీ ఊహించలేనంత మార్పు. ,,ఇదేమిటి?" అను-కున్నాడు అతను.

శాంతమ్మగారు వంట చేస్తున్నారు. ,,ఉదయా, కూర తరిగి పెట్టమ్మా" అన్నమాట వినగానే వంటిట్లోకి వచ్చి కత్తిపీట, కూరగాయలూ తీసుకొని కూర తరగడం మొదలు పెట్టింది. ఏపనిలో లీనమైనా నిన్న జరిగిన

సంఘటన ఉదయ మనస్సును బాధిస్తూ ఉంది. తనకు తెలియకుండానే ఎంత జరిగిపోయింది.

తనకీ విషయం ఏమాత్రం తెలిసినా ఈ పెళ్లికి అంగీకరించి ఉండేదికాదు. తన తండ్రి తనకు తెలియకుండానే పదివేలు ధారపోసేడు, తన సౌఖ్యం కోసం ఆశయం కూడా బలి అయిపోయింది ఈ సౌఖ్యనికి.

తను కట్నం తీసికోనేవాడిని వివాహం చేసికోకూడదు అనుకుంది అలాగే ప్రతిజ్ఞ చేసుకుంది. మరి ఇప్పుడేం జరిగింది ? తన రచనలతోనూ ఉపన్యాసాలతోనూ యువతను వరకట్న నిర్మూలనకు ఉత్తేజ పరచిన తను ఓడిపోయింది.

కూర తరిగుతునే ఇలా ఆలోచిస్తున్న ఉదయ వేలు తెగింది. ఎర్రని రక్తం కారుతోంది. ఆ బాధకు ఓర్చుకోలేక "అబ్బా" అంది చిన్నగా. పచ్చడి రుబ్బుతున్న శాంతమ్మ గారు "ఏమయింది తల్లీ" అంటూ ఉదయ దగ్గరకు వచ్చారు. "ఏంలేదు అత్తయ్యా" అంటూ చేతిని వెనక్కు తీసుకుంది. "వేలు తెగిందే" అంటూ చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. "అమ్మా శశీ త్వరగా రా అమ్మా" అంటూ కేకవేసారు. ఉదయ చేతికి ఐడిన్ పెట్టి కట్టు కట్టింది శశి.

"ఇదేవిటీ వదినా ? ఇంత మాత్రానికే బాధపడుతున్నావా ? ఆమె కళ్లల్లో నీళ్లుచూసి అడిగింది శశి.

కాని తన బాధ వేరు. తన మనస్సులో విషయం ఎలా తెలుసుకోగలరు శశి ? ఆడపడుచు అలా అడిగే సరికి

ఉదయ దుఃఖం రెట్టింపు అయింది. ఆమె వడిలో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చేసింది.

"అదేమిటి వదినా చిన్న పిల్లలా తగ్గి పోతుందిలే" అంది ఉదయి తల నిమురుతూ ఆక్షణంలో తన మనస్సులోని ఆవేదన అంతా శశితో చెప్పాలనిపించింది.

"అది కాదు శశీ!" చిన్నగా అంది.

"ఒహో! అదా దానికేం ఉంది వదినా. నువ్వేదైనా వ్రాయాలను కుంటే నువ్వు చెప్తూఉంటే నే వ్రాసేస్తా. శెలవు రోజేగా. ఈ శశి వుండగా నీకు ఏ విషయానికీ దిగులు లేదనుకో. రేపటికి నీకే తగ్గిపోతుంది" ఉదయ బాధ అర్థం అయి పోయిన దానిలా అంది. ఉదయ ఆ మాటలకు కళ్లు తుడుచుకొని నవ్వేసింది.

భోజనాయులన తర్వాత "చెప్పండి రచయిత్రిగారూ" అంటూ ఉదయ దగ్గరకు వచ్చింది శశీ.

"రచనలు వ్రాసే అర్హత నేను కోల్పోయాను"

"అదేమిటీ? ఆశ్చర్యంగా అంది శశి. "రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించిన కొద్ది రోజులలోనే ప్రఖ్యాత రచయిత్రిగా పేరు తెచ్చుకున్నావు. నువ్వు రచనల వ్రాసే అర్హత కోల్పోయావా?" తన అశ్చర్యాన్ని వ్యక్త పరచింది శశి. అమాయకంగా.

"నేను మరేమీ వ్రాయలేను. ఇక నుంచీ నేను రచయిత్రిని కాను" ఆవేదనతో నిండిన ఆమె మాటలు శశికి అర్థం కావడం లేదు.

"ఏమిటి అలా మాట్లాడు తున్నావు వదినా ? నీ మనస్సులో ఏదో ఉంది. చెప్పక పోతే నామీద ఒట్టు" అంటూ ఉదయ చేతిని బలవంతంగా తన చేతుల్లోకి తీసుకొని చేతిలో చెయ్యి వేసింది.

"అంత మాట అనకు శశీ. నాకు నీతో చెప్పాలనే ఉంది."

"మరి చెప్పేసెయ్యి. ఎవ్వరూ లేరుగా. అమ్మ కాంతమ్మ పిన్నిగారింటికి వెళ్ళింది. ఇప్పుడే రాదులే."

కాంతమ్మ గారి పేరు వినే సరికి ఉదయ మనస్సు ఏదోలా అయిపోయింది. నిన్న తను కాంతమ్మ గారి ఇంటికి వెళ్లినప్పుడే తనకీ విషయం తెలిసింది. కాంతమ్మ గారి అబ్బాయికి. పాతిక వేలు కట్నం తీసుకొంటున్నారంటే సహించలేని "ఏమిటి అత్తయ్య గారూ, మీ అబ్బాయి పెళ్లికి కట్నం తీసుకుంటున్నారా ? మీరంతా ఇలా చేస్తున్నంత కాలం ఈ సమస్య సమసిపోదు" అంది కాంతమ్మ గారు పట్టరాని కోపంతో "చాలు చాలు లేవే నీకబుర్లు. నువ్వు కథలు వ్రాసి నంత మాత్రాన ఏమయింది. మీ అత్తగారు తీసికో లేదా పదివేలు నీ పెళ్లికి"

ఆమాట వినేసరికి ఉదయకు కాళ్ల క్రింద భూమి పగిలి పోయినట్లు అనిపించింది.

తనకు తెలియ కుండానే ఇంత జరిగిందా ! తన రవి వరకట్నం తీసుకున్నాడా ? ఆలోచిస్తూనే మరి అక్కడ ఉండలేక ఇంటికి వచ్చేసింది ఉదయ. వెంటనే రవిని అడిగి వెయ్యాలనుకొంది. కాని ఇప్పటి వరకు అడగ లేక పోయింది. ఇప్పుడు శశితో చెప్పుకొని వాపోయింది.

"పోనీలే, వదినా ! నీకిలాంటి ఆశయం ఉందని మాకెవ్వరికీ తెలియదు. తెలిస్తే ఇలా జరిగేది కాదు. అమ్మ బలవంతం మీద అన్నయ్య ఒప్పుకున్నాడు గాని కట్నం తీసికోవడం అంటే అసలు ఇష్టం లేదన్నయ్యకు. ఇక ఈ విషయం మరచిపో వదినా ! ఉదయ ముంగురులు సవరిస్తూ అంది శశీ. తీయని మాటలతో ఓదార్పుకు తనకు తెలియండానే నిద్రలోకి జారుకుంది ఉదయ.

ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన రవి ,,వదిన అలా ఉందేమి శశీ" నిద్రపోతూ ఉన్న ఉదయను చూస్తూ అడిగేడు.

,,అలా పద అన్నయ్య చెబుతా" అంటూ తన గది వేపు నడిచింది శశీ. అనుసరించాడు రవి.

* * *

మనస్సుకు హాయి గొలిపే సన్నజాజుల పరిమళాన్ని కిటికీలో నుంచి వెదజల్లు తోంది, గదిలోకి గాలి. టేబులు ఉన్న అగరు వత్తులు ఆ పరిమళంలో పోటీ బడుతున్నాయి. ఆ సౌరభాన్ని ఆస్వాదిస్తున్నాడు రవి. అతని మనస్సు ఎంతో హాయిగా ఉంది. తన పొరపాటును తను తెలుసు కున్నాడు. తెలుసుకోవడమే కాదు. సరిదిద్దుకో బోతున్నాడు ఉదయ తనను హృదయ పూర్వకంగా క్షమిస్తుంది. తన భార్య రాక కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. నెమ్మదిగా గదిలోకి వచ్చింది వుదయ.

,,పాలు తీసుకోండి" పాలగ్లాసు టేబులు మీద పెడుతూ అంది.

ఒకసారి ఉదయ ముఖంలోకి చూచాడు రవి. ఆమె ముఖంలో విషాద మేఘాలు ఆవరించు కున్నాయి. చిరు నవ్వుల వెన్నెల చిందే జాబిలి లాంటి ఆమె ముఖంలో విషాదాన్ని చూస్తూనే బాధ పడ్డాడు. ఉదయ ముఖంలో చిరు నవ్వుల వెన్నెల వెలగాలి అందుకే తను అనుకున్నట్టు చెయ్యాలి. తనను ఉదయ క్షమిస్తే చాలు.

"ఉదయా!" నెమ్మదిగా పిలిచాడు. ఏమిటి అన్నట్టు చూసింది ఉదయ.

ఆమె దగ్గరగా చేరి నన్ను క్షమిస్తావు కదూ" అన్నాడు దీనంగా. ఉదయ కళ్లలో నీళ్లు నిలిచేయి. "శశి నా కంతా చెప్పింది. నేను ఊరికే నిన్ను క్షమించమని అడగటం లేదు. నేను నా పొరపాటు సరిదిద్దు కోవాలనే అనుకుంటున్నాను" అంటూ ఆమె చేతికి ఒక కవరు అందించేడు.

అలాగే నిలబడి చూస్తూ ఉన్న ఉదయతో "యీ కవరు తెరచి చూడు ఉదయా! తరువాత నేను క్షంతవ్యుడనయితేనే మన్నించు అన్నాడు.

భార్యతో భర్త అలా మాట్లాడడం ఉదయకు నిజంగా చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. తన అధిక్యతను అన్ని విషయాల్లో చాటుకొవడానికి చూస్తారు, చాల మంది పురుషులు. కాని రవి తనను అతనితో సమానంగా గౌరవిస్తూ ఉంటే ఆశ్చర్యమయింది ఉదయకు. కవరు తెరచి చూచింది

తన తండ్రి పేర పది వేలకు చెక్కు ఉంది ఆ కవరులో !

దానితో జతపరచి ఉన్న ఉత్తరం చదవసాగింది.

"పూజ్యులయిన మామగారికి మీ అల్లుడు రవి. మీ అమ్మాయి ఉదయకు వరకట్నం తీసుకొనే వాడిని వివాహం చేసుకోడం ఇష్టం లేదని నాకు తెలియదు. నాకు అటు-వంటి ఆశయముండన్నా "ఇంట్లో ఎదిగిన ఆడపిల్ల ఉండగా నీ ఆదర్శాలేమిటిరా! నీలా కట్నం తీసుకోని యువకుడు దానికి దొరుకుతాడని నమ్మకం ఏమిటి ? నువ్వు కట్నం తీసుకుంటే ఆడబ్బుతో దాని పెళ్లి చేసెయ్యవచ్చు" అన్న మా అమ్మ మాటను కాదన లేకపోయాను. నా ఉదయ ఆశయం నా కోసం బలైపోవడానికి వీల్లేదు. అందుకే దయచేసి ఈ ధనాన్ని మీరు స్వీకరించండి." ఉత్తరం ముగించిన వుదయ మనస్సు భర్తపై కృతజ్ఞతతో నిండిపోయింది.

"మీ వంటి ఉన్నత భావాలు గల భర్త లభించడం నా అదృష్టం."

నీకు తెలియకుండా మీ నాన్నగారు కట్నం,, ఇచ్చినట్టు తెలిసి ఉంటే నేను తీసికోనేవాడిని కాదు. ఇక నీ ఆశయం నెరవేరినట్టేగా. నువ్వు ఆదర్శ వంతమైన రచనలతో లోకాన్ని ఉత్తేజపరచాలి. నీఆశయం నెరవేర్చ-డంలో మా అమ్మకు కోపం వచ్చినా నేను బాధపడను" అన్నాడు రవి.

ఉదయ హృదయంలో అలుముకున్న విషాద మేఘాలు చెదరి పోయాయి. ఆమె ముఖంలో చిరునవ్వుల వెన్నెల విరబూసింది. ఉదయ కళ్లు నూతన కాంతులతో మెరిసాయి.

"యోజన" (1-14 సెప్టెంబర్ '77)

★